


గాలి రావడానికి భయపడే కొట్టుగది లాంటి గదిలో మసక మసక చీకట్లో, చీకటి ముద్దలా, మూలన పడేసిన మాసి పోయిన గుడ్డలా, గొంతుకిలా కూర్చుని, ముడుచుకున్న కాళ్ళల్లో చేతులు కూడా దూర్చుకుని గెడ్డం మెకులమీద ఆనించుకుని, కనురెప్పలు మూసుకుని "ఇహంలో ఇంత బ్రతుకూ బ్రతికేను... పరంలోకి నన్నెంత త్వరగా తీసికెళ్తావురా భగవంతుడా...." అనే కోరికతో తపస్సు చేస్తున్నవాడిలా కూర్చున్నాడు ఆదిమూర్తి.

ఆ కొట్టుగది తలుపురెక్కలు ఒకటి తీసి, రెండోది వేసివున్నాయి. వరండాలో వెలుగుతున్న బల్బు తాలూకు కాంతి, చేరేసివున్న తలుపురెక్క గదిలోనికి రానివ్వకుండా అడ్డేస్తోంది. ఆ తలుపు రెక్క తీస్తే ఆ వెలుగు లోనికొచ్చును. కానీ ఆదిమూర్తి ఆ ప్రయత్నమేమీ చెయ్యలేదు. చీకట్లో పుట్టి, చీకట్లో పెరిగి, చీకట్లో బ్రతుకుతున్నవాడిలాగా, చీకటిబ్రతుక్కి అలవాటుపడిపోయిన వాడిలాగా వరండావేపు చూస్తున్నాడు ఆదిమూర్తి.

వరండా చివర మెట్లమీద మనవడూ, మనవరాలూ పెద్ద ఎత్తున గోలచేస్తూ తమ మిత్రబృందంతో 'బొమ్మల పెళ్ళాట' ఆడుతున్నారు. పై మెట్టుమీద కర్ర పెళ్ళికొడుకుని, కర్ర పెళ్ళికూతుర్ని కూర్చోబెట్టారు. మెట్లక్రింద, మీద లక్కపిడతలు చెల్లాచెదురుగా పడి వున్నాయి. బొమ్మలకు పెళ్ళిచేసే ప్రయత్నంలో ఇద్దరు ముగ్గురు పిల్లల పెళ్ళిపెద్దలు చాలా గాభరాగా హడా విడిగా వున్నారు. ఇంకో ముగ్గురు, తూతూ బాజా వాయిస్తున్నారు. ఆ

తతంగం చాలాసేపట్నించీ జరుగుతోంది. అందరూ కలిసి నిజంగా పెళ్ళి జరిగినప్పుడు తిరిగే పెద్దమనుషుల్లా హడావిడిగా తిరుగుతున్నారే తప్ప ఆ బొమ్మలకు పెళ్ళి మాత్రం ఇంతవరకూ చెయ్యలేదు.

"ఒరేయ్ బోడీ, చిట్టీ తిండికి రండర్రా...." ఆ కేక లోన వంటగది లోంచి వాళ్ళమ్మ వేసింది. తమలో తామందరూ 'పెళ్ళి రేపు జరుపుదామనే నిశ్చయాని' కొచ్చి ఎవరి బొమ్మలు, ఎవరి లక్కపిడతలు ఎవరివి వాళ్ళు పట్టుకుని పారిపోయారు.

"ఏవర్రా....ఎక్కడ చచ్చారు...." పెళ్ళి పెద్దలందరికీ వీడ్కోలు చెప్పి మనవడూ, మనవరాలూ వెళ్ళేసరికి వాళ్ళమ్మ కోపంతో ఇద్దరికీ రెండు వడ్డించేసింది.

"బలాదిలీగానే పుస్తకాలు మూలన పడేయడం....ఇసకలోనూ .... అడ్డమైన వాళ్ళిళ్ళలోనూ దొర్లడం .... చదువు లేదు....సంధ్యా లేదు...." పిల్లలిద్దరూ ఒకరి ముఖాలు ఒకరు చూసుకుని ఒకేసారి ముఖారీరాగాన్ని అరంభించేరు.

"ఏడ్చేరంటే .... కుమ్మేస్తాను .... నోర్మూయ్యండి .... నోర్మూస్తారా .... రమ్మన్నారా...." ఇద్దరూ చేతులతో నోళ్ళను మూసుకుని ఒకరి వేపు ఒకరు బిక్కచచ్చిపోయి చూస్తున్నారు.

తర్వాత మాటలేం వినబడలేదు ఆదిమూర్తికి. అన్నం తిండానికి ఇద్దర్లో ఎవరో అల్లరిపెడితే వాళ్ళమ్మ మళ్ళీ గుద్దిన గుద్దులు దభీదభీమని వినిపించాయి.

"పిల్లల్నెందుకలా కొడతావు .." ఆ మాట నోటిదాకా వచ్చింది ఆదిమూర్తికి. కానీ అడగలేకపోయాడు. అడిగే పిచ్చి ప్రయత్నమేమీ చెయ్యదల్చుకోలేదు.

"నా పిల్లలు....నా ఇష్టం....మీకెందుకంత బాధ...." ఇలాటి జవాబే వస్తుంది. అవును. ఎవరి పిల్లల్ని వాళ్ళు కొట్టుకుంటారు. చంపుకుంటారు. చీల్చుకుంటారు. మధ్య తనకెందుకు బాధ.... తను వాళ్ళకు తాతనవడూ, వాళ్ళు తనకు కొడుకు పిల్లలు, మనవలవరూ.... మనవల బాగోగులు చూడ్డానికి తను తగడా....తను వాళ్ళకి తాత కాడా.... వాళ్ళ దృష్టిలో తనెందుకింత చెడ్డయిపోయాడు. లోకంలో అందర్లా పెంచిన పిల్లల ఆదరణలో బ్రతకాలని కోరుకోవడం తప్పా? వాళ్ళు రెక్కలు ఎదిగి ఎగరగలిగేవరకూ చూసి సంతోషించడానికేనా తల్లిదండ్రులు. తమకు కాళ్ళూ చేతులూ వంగితే కన్నవాళ్ళ దగ్గరికి చేరడం తప్పా. అలాంటి ఆశలు ఈ తరం తల్లిదండ్రులు పెట్టుకోగూడదా? కని పెంచినదాకానే వాళ్ళ బాధ్యత.

ఇలాగా ఆలోచించడం ఆదిమూర్తికి అలవాటే. ఎనిమిదేళ్ళ ఈ ఆలోచన్లు అతని జీవితంలోకి బాధలు మరచిపోవడానికి స్నేహితుల్లా వస్తేస్తున్నాయి. జీవితం అంతా తీరుబడే. ఈ తీరుబడిలో అతనెంతో తృప్తికరమైన జీవితం కావాలని దేవుడికి 'దణ్ణాలు' పెట్టుకున్నాడు. కని పెంచినవాళ్ళని, వాళ్ళ పిల్లల్నీ చూస్తూ, గతాన్ని, గతంలో బాధల్ని మరచిపోవచ్చు ననుకున్నాడు.

కానీ -

అతను వూహించినదొకటి. ఎదురైన పరిస్థితి వకటి.

తనెంత కష్టపడి కొడుకుని పెంచాడు. పెద్దమార్కెట్లో కర్రలు మోసి కూలికి వచ్చిన డబ్బుతో కొడుకుని చదివించేడు తను. బాబామెట్ట కొండల దగ్గర 'రాళ్ళ మిషను' దగ్గర రాళ్ళబుట్టలు మోసి కొడుకుని అష్టకష్టాలుపడీ చదివించేడు. ఎండనకా, వాననకా, ఎండలో కరగి, వానలో నీరై వాడి బాగుకోసం అహో రాత్రులు కష్టపడ్డాడు తను. తన పేద తనం వాడికి రాకూడదని, వాణ్ణి ఒక పేదవాడి కొడుకుగా, లోకం చూడకూడ దని, వాడు నలుగురిలో దర్జాగా తిరిగితే చూడాలని 'ఫలానావాడు.... వాడు.... మా' అబ్బాయే ..... నని గర్వంగా చెప్పుకోవచ్చని.... ఎన్ని బాధలు పడ్డాడు తను!

ఆదిమూర్తికి వక్కసారి అదేదో సినిమాలో ట్రిక్ ఫోటోగ్రఫీలా కొడుకు కొండల్రావుఐదేళ్ళవాడిస్వరూపం-ముప్పై ఏళ్ళ స్వరూపం రెండూ వక్కసారే కళ్ళముందు కనబడ్డాయి.

ఎంతలో ఎంత ఎదిగిపోయాడు!

కొండల్రావుకి మిల్లులో సూపర్ వైజర్గా వుద్యోగం వచ్చినప్పుడు ఎంతగా పొంగిపోయేడు తను. తన ఆశలు తీరినందుకు, తన కలలు పండి ఫలించినందుకు ఇదమిత్థమని తెలియని ఆనందం ఎంత అనుభవించాడు తను. ఇన్నాళ్ళూ తను పడ్డ కష్టాలు ఈడే రాయని, హాయిగా 'రామా కృష్ణా' అను కుంటూ సుఖపడాలని ఎంతగా కోరు కున్నాడు తను. ఆఖరికి తన కలలు ఏమాత్రం పండాయి? తన ఆశలు ఏమాత్రం తీరినాయి? అన్ని కష్టాలు పడి పెంచిన కొడుకు వుద్యోగం వచ్చాక ఎంతగా మారిపోయాడు. దూరపు చుట్ట రికం చూసి తనే దగ్గరుండి పెళ్ళి జరి పించాడు. 'కట్నాలు' ఇవ్వడానికి డబ్బు లేక ఎవరూ పెళ్ళి చేసుకుంటామని ముందుకు రాక వుండిపోతే కుటుంబం మంచిదని, డబ్బులో ఏఁవీలేదని, కొడు కుని వప్పించి ఆ పేదపిల్లనే ఇంటికి కోడలిగా తెచ్చుకున్నాడు. ఆ విషయ మంతా మరిచిపోయింది కోడలు. పరాయి వాడికి మొగమాటానికి చూపే కృతజ్ఞ తన్నా ఆమెలో లేదు. కొడుకూ సరే సరి!

కొడుకూ కోడలిచేత రోజుకెన్ని మాటలు పడుతున్నాడు తను. ఆకలేస్తే ఆ ఆకలిని చంపుకుని వుండలు చుట్టు కుని చావాలే తప్ప ఆకలని అడగ్గూడదు'

"ఆకలేస్తుంది. అన్నంపెట్టు లక్ష్మీ ...." కోడల్ని అడిగితే—

"అప్పుడే తయారయ్యావ్....గంట య్యింది కావాల తిండితిని....లోకంలో ముసిలోళ్ళంతరూ తిండరక్క చస్తుంటే ....ఇరవై నాలుగ్గంటలూ ఆకలని చస్తావ్...." తనని కోడలు సాధింపు.

ఆరోజు తనకి బాగా జ్ఞాపకం వుంది. దగ్గూ, జ్వరంతో శవంలా కదలలేని స్థితిలో విలవిల్లాడుతున్న సమయంలో గొంతెండిపోతుంటే "లక్ష్మీ....లక్ష్మీ... అని పిలిచేడు తను.

సమాధానం లేదు.

మనవడిని పిలిచేడు. కానీ వాడు విని పించుకోలేదు

ఈ నారి పేగులన్నీ కూడదీసుకుని గట్టిగా పిల్చాడు.

"ఏం....ఎందుకలా చస్తున్నావ్...." గలగలా వచ్చింది లక్ష్మి

"పేగులు తెగిపోతున్నాయి....దగ్గు ....మంచి నీళ్లు...." నులకతాడులా చుట్టుకుపోతూ అడిగేడు.

"అయ్యో దేవుడా....ఇల్లంతా ఎతుక్కో....ఒక్కచుక్క లేదు....ఎండలొకటి తినేస్తున్నాయి కొళాయిలు రాలేదు....పనిమనిషిచేత వీధిపంపునుంచి తెప్పిద్దామంటే 'దరిద్రపుగొట్టుది' అది పనెగ్గొట్టింది. పక్కింటికి పంపి ఎవరి చేతైనా తెప్పిస్తా నాగు....దిక్కుమాలిన దగ్గు....నన్ను తినీడానికొచ్చింది గావాల ...." ఆ మాటలనుకుంటూ వెనక్కి తిరిగి వెళ్ళిపోయింది కోడలు. నీళ్లొస్తాయని ఎదురుచూశాడు తను. కానీ గ్లాసెడు నీళ్ళకు దిక్కులేకపోయింది.

"ఈ వెధవబ్రతుకు బ్రతికేకన్నా.... ఇలాగే గొంతెండి చచ్చినా బావుణ్ణు.... పీడ విరగడైపోను...." తనఅసమర్థతని తల్చుకొని మెల్లిగా గొణుక్కున్నాడు.

ఆ మాటలు ఎక్కడనుంచి విందో ఏమిటో కోడలు చేతులూపుకుంటూ వచ్చింది.

"ఏవన్నావు ... నేన్చస్తే పీడ విరగడైపోతుందా....అందరికీ నేనే బరువైపోయానా....కోడలని ఆమాత్రం చూడకండా నోటికెంత మాటొస్తే అంతమాట అనేస్తావా .... నేన్చస్తే....నీ కొడుకుని కూడా నీలాగే అడనీడ లేకుండా బ్రతకమన్నావా...." అంటూ ఇష్టం వచ్చినట్టు వాగుతోంది గయ్యాళి కోడలు.

"నిన్నెందుకమ్మా అంటాన్నేను.... ఇంత బాధ భరించేకంటే....మిమ్మల్నందరినీ ఇబ్బంది పెట్టేకంటే నేన్చచ్చినా బావుణ్ణు....నాపీడ మీకుండదనంటున్నాను. ఆ పైవాడు నన్నెంత త్వరగా తీసుకుపోతాడా అని ఎదురుచూస్తున్నానమ్మా ....అంతే...."

"ఇంత వయసొచ్చి మాట మార్చడం ఒకటి....అనడం....లేదనడం.... వెధవ బుద్ధి...." ఆ విషయం అక్కడితో ఆగిపోతుందనుకున్నాడు. ఆగలేదు. కొడుకొస్తే చెప్పింది కావాల. తను చెప్పింది ఏమీ వినిపించుకోలేదు తన కొడుకు. మంచీ, మర్యాదా, గౌరవం ఇవేవీ ఆసమయంలోకొడుక్కిగుర్తుకిరాలేదు. 'ముసలాడనే'ధ్యానంకూడా లేకండా ఎన్నిదెబ్బలు కొట్టాడు. రెండుసార్లు చేతితో కొట్టాడు. నేలమీద 'వఖాలున' పడిపోయాడు తను. నేలమీద పడ్డవాణ్ణి పైకిలాగి మళ్ళీఇంకో రెండుసార్లు గోడకేసి కొట్టాడు.

మౌనంగా ఆ బాధల్ని భరించడం తప్ప ఏం చెయ్యగలడు తను. "ఏదో కనికరించి కూడెడుతున్నాం....ఇష్టంలేక పోతే బైటకెళ్ళిపో గాని దాన్నేమాత్రం అంటే నేనూరుకోను...." ఆఖరిగా కొడుకు తనకిచ్చిన వార్నింగ్ అది. అప్పణ్ణించే తాను పూర్తిగా మూలన పడ్డాడు.

"తాతా .... తిండికి పిలుస్తోందమ్మ" మనవడి పిలుపుతో ఈ లోకంలోకొచ్చాడు ఆదిమూర్తి.

అప్పటికి బాగా చీకటిపడింది. కొడుకింకా ఇంటికి రాలేనట్టుంది. 'రా

తాతా' అని మళ్ళీ పిలిచి తలుపురెక్కని పట్టుకుని నిలబడ్డాడు మనవడు.

కడుపులో కరకరమనిఆకలేస్తున్నాది. అయినా మనసులోని బాధ ఆ ఆకల్ని చంపేస్తున్నాది. ఇలాంటి వయసులో ఇలాంటి బాధలు రానేకూడదు. వచ్చాక, ఇలాంటి బాధల్లో బ్రతికేకంటే 'నల్ల మందూ, సూనె' కలుపుకుని తాగిచావటం మేలు. అయినా తనకి చావు రాకున్నందుకూ, చావకున్నందుకూ మూలిగాడు ఆదిమూర్తి.

"ఆకలేయడం లేదురా తిననని అమ్మతో చెప్పు " మనవడు పరుగు పరుగున లోనకెళ్ళిపోయాడు.

"తినకపోతే మానీమను ఎవడిమీద కోపం పంచభక్ష్యపరమాన్నాలు కావాల కామోసు " ఆ మాటలు ఆదిమూర్తికి వినబడుతూనే వున్నాయి. కోడలి గయ్యాళితనానికి ఆదిమూర్తికి ఆ సమయంలో జాలివేసింది

అంతవరకూ పడుకొన్నవాడుమెల్లిగా లేచి మూలనున్న చింకిచాప తీసి పరచుకుని మేను వాల్చేడు ఆదిమూర్తి.సన్నగా చలివేస్తోంది. దుప్పటికోసం చేత్తో ఒట్టూ తడిమేడు. తల వెనకాతల మెత్తగా తగిలింది దుప్పటి. విప్పి కప్పుకోబోయిఆగిపోయేడు. ఎన్నాళ్ళబట్టి వుతకలేదో ఆ దుప్పటి కుళ్ళు వాసనవేస్తోంది. ఆ మురికి దుప్పటిని చూస్తుంటే ఆదిమూర్తికివక్కసారి తండ్రి జ్ఞాపకానికొచ్చాడు. తల్లిలేని తనని ఎంత ఇదిగా పెంచేడు. జీవితం చివరి రోజుల్లో వున్న ఎకరన్నర పొలానికీ తినకిచ్చేసి తన పిల్లరచిల్లరితిపగుళ్ళు కడతాయని పెళ్ళిచేశాడు. తన నీడలో జీవితపు ఆ చివరి దశని హాయిగా గడపాలనుకున్నాడు.

ఆ రోజు బాగా జ్ఞాపకం వుంది!

బైట చలి!

పాకలో తనూ, కొత్తపెళ్ళాం,కొత్తదుప్పట్లో దూరి వెచ్చగా పడుకున్నారు. పాక ముంజూరులో తండ్రి ఒక్కడూ ఎముకల్ని కొరికే చలిలో కప్పుకోడానికేవీ గుడ్డముక్కైనా లేకుండా వణుకుతూ పడుకున్నాడు.

అర్ధరాత్రెప్పుడో తనని పిలిచాడు.

"ఒరే ఆదీ...ఆదీ. సస్తన్నాను చింకి గుడ్డివ్వరా. సలి సంపెస్తంది. సస్తాను రా "

"సలీలేదూ గాడిద గుడ్డూలేదు మాట్లాడక పడుకో " లోననుంచి తను అరిచాడే తప్ప పెళ్ళాం పక్కలోంచి కదలలేదు.

మర్నాడుదయానికి అంత ఘోరం జరుగుతుందని వూహించనైనా ఊహించలేదు తను. ముసిలిప్రాణం చలి బాధకు తట్టుకోలేక తండ్రి చచ్చిపోయాడు ఆ చచ్చిపోవటానికి కారణం తనుకాదూ.

నిజంగా తనే.

ఆదిమూర్తికి ఒక్కసారి జ్ఞానోదయమైనట్టుంది. నిజమే. తను తన తండ్రిమీద ఏమాత్రం ఆప్యాయత చూపించేడు, ఈనాడు తన కొడుకు తనమీద చూపించడానికి. ఇదింతే. ఈ రివాజిలా సాగిపోవాల్సిందే.

---